@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శుక్రవారం 31, మే 2024 || పేజీలు: 04



## కేరళకు నైరుతి

- మొదలైన భారీ వర్షాలు
- 14 జిల్లాల్లో ఎల్లో అలర్ట్
- వారంలోగా తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించే ఛాన్స్: వాతావరణ శాఖ

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ/తిరువనంతపురం-మే30:**

నైరుతి వచ్చేసింది. కేరళ తీరాన్నా గురువారం తాకింది. ఎండలతో అల్లాడుతున్న వేళ దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లటి వార్త మిగతా 2లో..



జూన్ 2న ఉదయం 10:35గంటలకు

## తెలంగాణ రాష్ట్ర గీతం జాతికి అంకితం

- 3 చరణాలతో కూడిన 2:30 నిమిషాల నిడివి గల వెర్షన్ ఆవిష్కరణ
- 13:30 నిమిషాల నిడివితో పూర్తి వెర్షన్ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తాం క్యాబినెట్ నిర్ణయంతోనే ఓకే: రేవంత్
- తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర చిహ్నం ఇంకా ఖరారు కాలేదని తెలిపిన సీఎం
- జూన్ 2న.. రెండు పూటలా వేడుకలు
- అందెశ్రీ, కీరవాణికి సర్కారు సన్మానం
- వేడుకల్లో పాల్గొననున్న సోనియా, రాహుల్..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మే 30:**

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా.. జూన్ 2న ఉదయం 10:35 గంటలకు రాష్ట్ర గీతమైన 'జయజయహే తెలంగాణ'ను ప్రభుత్వం జాతికి అంకితం చేయనుంది. మూడు చరణాలతో కూడిన రెండున్నర నిమిషాల వెర్షన్‌ను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించనున్నారు. 10:35 గంటలకు మొదలుపెట్టి.. 10:37:30 సెకన్ల వరకూ ఈ గీతాన్ని వినిపించనున్నారు. దీంతో పాటు.. 13:30 నిమిషాల నిడివిగల పూర్తిగీతాన్ని కూడా సర్కారు ఓకే చేసింది. కాగా.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర గీతం ఆవిష్కరణ అనంతరం ఐదు నిమిషాలపాటు ప్రసంగించనున్నారు. సోనియాతో పాటు రాహుల్, ప్రియాంక గాంధీల్లో ఎవరో ఒకరు ఈ కార్యక్రమానికి మిగతా 2లో..




## విత్తన కంపెనీలు సక్రమంగా పనిచేయాలి

- అవసరమైన విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయాలి
- యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం విత్తనాల సరఫరా
- అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే30:**

విత్తన కంపెనీలు ప్రణాళిక ప్రకారం పత్తి విత్తన ప్యాకెట్లను జూన్ 5లోగా జిల్లాలకు చేర్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో ఒక కంపెనీకి చెందిన ఒకే రకమైన విత్తనాలనే రైతులు కోరుతున్నారని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అలా కాకుండా యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం మార్కెట్లో మిగతా 2లో..



## చైనాలో మరో కొత్త వైరస్!

- సోకితే 3 రోజుల్లోనే మరణం!!
- హెబీ మెడికల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు వెల్లడి

2

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే30:**

2020లో కరోనా మహమ్మారి ప్రపంచమంతా వణికించింది. ఈ వైరస్ తో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది శాస్త్రవేత్తలు ముందుకు వచ్చి చైనాలోని వుహాన్ ల్యాబ్ నుండి మిగతా 2లో..



## అమరుల కుటుంబాలకు ఆహ్వానాలు

- ఘనంగా ఆవిర్భావ ఉత్సవాలు
- రాష్ట్ర స్థాయిలో పరేడ్ గ్రౌండ్‌లో కార్యక్రమం
- రాత్రి 7గంటలకు ట్యాంక్‌బండ్‌పై వేడుకలు
- జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో జాతీయ జెండా ఆవిష్కరణలు
- విస్తృత ఏర్పాట్లు: సీఎస్ శాంతికుమారి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మే 30:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరు కావాలని అమరుల కుటుంబ సభ్యులు, ఉద్యమకారులకు ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా మిగతా 2లో..



## ముగిసిన ప్రచారం

- దేశవ్యాప్తంగా ముగిసిన పార్లమెంటు ఎన్నికల ప్రచారం
- జూన్ 1న చివరిదశ పోలింగ్
- 57 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్..

## లోగోలు కాదు.. బతుకులు మార్చండి


### చార్మినార్ తొలగింపు హైదరాబాదీలను అవమానించడమే: కేటీఆర్

- కాకతీయ కళాతోరణం తొలగిస్తే వరంగల్ చరిత్రను అగౌరవపర్చినట్లే
- మూరపు నిర్ణయాలు మానుకోండి రాజముద్ర మార్పు వద్దు.. లేదంటే
- రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపడతాం చార్మినార్ వద్ద మీడియాతో కేటీఆర్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే 30:**

రాష్ట్ర రాజముద్ర నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగించాలనుకోవడం మూరపు నిర్ణయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ వారసత్వ సంపద, సంస్కృతికి చార్మినార్, కాకతీయ కళాతోరణాలు ప్రతీకలని చెప్పారు. చార్మినార్‌ను తొలగించడమంటే హైదరాబాదీలను అవమానించడమేనని, కాకతీయ కళాతోరణం తీసేయడమంటే వరంగల్ చరిత్రను అగౌరవపర్చినట్లేనని తెలిపారు. 'లోగోలు కాదు.. ప్రజల బతుకులు మార్చాలి. జనం ఎన్నుకున్నదే అందుకనే విషయాన్ని పాలకులు గుర్తించాలి' మిగతా 2లో..





## ఘోర ప్రమాదం

- లోయలో బస్సు పడి 22మంది మృతి
- 57 మందికి గాయాలు

**నేటి ఫోకస్ న్యూస్, జమ్మూ, మే 30:**

జమ్మూకశ్మీర్‌లో గురువారం ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తున్న బస్సు జమ్మూ జిల్లాలో అదుపు తప్పి దాదాపు 150 అడుగుల లోతు ఉన్న లోయలో పడిపోవడంతో 22 మంది దుర్మరణం చెందారు. మరో 57 మంది గాయాలపాలయ్యాయని అధికారులు తెలిపారు. జిల్లాలోని అఖ్నూర్ ప్రాంతం చౌకీ చోరా బెల్ట్‌లోని తుంగి-మోర్ వద్ద మధ్యాహ్నం 12.35 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ బస్సు హరియాణాలోని కురుక్షేత్ర మిగతా 2లో..



## ఆదిలాబాద్‌లో పత్తి రైతుల ఆందోళన

- విత్తనాల కోసం మూడో రోజూ రోడ్డెక్కిన రైతులు
- పంజాబ్ చౌక్‌లో ఆందోళనతో ట్రాఫిక్ జామ్

వివరాలు 03లో..

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
శుక్రవారం 31, మే 2024

## చైనాలో మరో కొత్త వైరస్!

(మొదటి పేజీ తరువాయి..)

కరోనా వైరస్ ఉద్భవించిందని చెప్పారు.. కాని చైనా మాత్రం ఎలాంటి స్పందన ఇవ్వలేదు. పైగా ఈ విషయంపై ఖండించింది కూడా.. ఇప్పుడిప్పుడే ఈ మహమ్మారి నుంచి బయటపడుతుండగా తాజాగా మరో భయంకరమైన విషయం ప్రజల్లో ఒణుకుపుట్టిస్తోంది. ఇప్పుడు మరోసారి చైనా కొత్త వైరస్‌ను సృష్టించినట్లు తెలుస్తోంది. అవును.. ప్రపంచాన్ని నాశనం చేసిన కరోనా వైరస్‌కు పుట్టినిల్లు అని చెప్పుకునే చైనాలో మరో వైరస్ గురించి చర్చ మొదలైంది. తాజాగా చైనాలోని హెబీ మెడికల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు కేవలం మూడు రోజుల్లోనే ఒక వ్యక్తిని చంపగల కొత్త వైరస్‌ను సిద్ధం చేశారు. 'సైన్స్ డైరెక్ట్' మ్యాగజైన్‌లో ప్రచురించిన ఈ పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఎబోలా వైరస్‌ను అనుకరించేందుకు శాస్త్రవేత్తలు సింథటిక్ వైరస్‌ను ఉపయోగించినట్లు సమాచారం. వ్యాధికారక ప్రభావాలను అధ్యయనం చేసేందుకు హెల్త్‌చైనీస్ శాస్త్రవేత్తలు కొత్త వైరస్ ఎబోలాను సృష్టించినట్లు తెలుస్తోంది. ఎబోలా వైరస్‌ను పోలిన ఈ కొత్త సింథటిక్ వైరస్‌ను ఇటీవల దాదాపు 10 చిట్టెలుకలపై పరీక్షించారు. టీకా వేసిన 3 రోజుల తర్వాత చిట్టెలుకలలో తీవ్రమైన లక్షణాలు కనిపించడం ప్రారంభించాయని నివేదికలు చెబుతున్నాయి. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా మూడు రోజుల్లోనే మృతి చెందినట్లు సమాచారం. ఈ చిట్టెలుకలు చనిపోయిన తర్వాత, పరిశోధకులు వాటి అవయవాలను పరిశీలించగా.. వైరస్‌ను వాటి శరీరంలోకి పంపించినప్పుడు చిట్టెలుక కళ్లకు ఇన్ఫెక్షన్ సోకిందని, దాని కారణంగా వాటి దృష్టి బలహీనంగా మారిందని గమనించారు. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, ప్రేగులు, మెదడు వంటి కణజాలాలలో వైరస్ పేరుకుపోతుందని.. ఎబోలా వైరస్ లాగా ఇది శరీరంలోని కణాలకు సోకుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం ఈ వైరస్ వల్ల ప్రయోజనాలు, ఇంకా ఎలాంటి ప్రాణహాని కలుగుతుందోనని సర్వత్రా తీవ్ర చర్చ మొదలైంది. ఈ భయంకరమైన వైరస్ బారి నుండి విరుగుడు కనిపెట్టేందుకు అగ్రరాజ్య శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే 2014 నుంచి 2016 మధ్య కాలంలో ఆఫ్రికన్ దేశాలలో ఎబోలా వైరస్ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపింది. వైరస్ బారిన పడి వేలాది మంది ప్రాణాలు కల్పోయారు.

## విత్తన కంపెనీలు సక్రమంగా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

లభ్యమవుతున్న అన్ని విత్తన హైబ్రిడ్ల దిగుబడి ఒక్కటేనని ఈ విషయాన్ని రైతులందరికీ సంబంధిత కంపెనీలు తెలియజేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లావారి, కంపెనీవారిగా ప్రత్తివిత్తన ప్యాకెట్ల పంపిణీ, కొనుగోలు వివరాలను పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రత్తి మరియు పచ్చిరొట్ట విత్తనాలు అవసరం మేరకు ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరం మేరకు విత్తనాలను ప్రభుత్వ ఆమోదిత దుకాణాల నుంచి కొనాలని సూచించారు. రైతులు విత్తనాలకు సంబంధించి ప్రతి కొనుగోలు బిల్లులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. పత్తి, పచ్చిరొట్ట లభ్యత, విత్తనాల పంపిణీపై రాష్ట్రస్థాయి అధికారులతో వ్యవసాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సమీక్ష నిర్వహించారు. నకిలీవిత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలకు వచ్చిన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్లు, అధికారులకు ఆదేశించారు. సీడ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... జిల్లాల వారిగా నేటికి 68,16,967 వివిధ కంపెనీల ప్రత్తివిత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా ప్యాకెట్లు కూడా జూన్ 5వ తేదీలోగా జిల్లాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో రైతుల అవసరం మేరకు ప్రత్తి, జిలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వివరించారు. విత్తనాలను జిల్లా కలెక్టర్లు రైతులకు సక్రమంగా చేరేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఎక్కడైనా రైతులు విత్తనాలు కొనుగోలు చేయడానికి భారీ సంఖ్యలో వస్తే కౌంటరులు ఎక్కువ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇకనుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రతినిత్యం పర్యటిస్తూ విత్తనాల విక్రయ కేంద్రాలు, జిలుగ, జనుము సరఫరా చేసే కేంద్రాల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గతవారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## లోగోలు కాదు.. బతుకులు మార్చండి!

(మొదటి పేజీ తరువాయి..)

అని కేటీఆర్ పేర్కొన్నారు. రాజముద్ర మార్పు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో గురువారం పార్టీ ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, మాగంటి గోపీనాథ్ తదితరులతో కలిసి ఆయన చార్మినార్‌ను సందర్శించారు. త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో దశాబ్ది ఉత్సవాలు పండగ వాతావరణంలో జరగాలన్నారు. పదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని గుర్తించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు రాకూడదని, ఆయన పేరు వినిపించకూడదన్న రాజకీయ కక్షతో మూరపు నిర్ణయాలు తీసుకుంటోందని ధ్వజమెత్తారు. 'ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చండి. ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నించండి. మూరపు నిర్ణయాలు మానుకోండి' అని హితవు పలికారు. రాజముద్రలో చార్మినార్, కళాతోరణాలను తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు 400 ఏళ్లు పూర్తయినప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఘనంగా ఉత్సవాలు నిర్వహించిందని, ఇప్పుడు హైదరాబాద్ ప్రతీక లేకుండా చేయాలనే ఆలోచన ఎందుకు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ బాసులకు తలూపడం మినహా.. సీఎంకు హైదరాబాద్ చరిత్ర, సంస్కృతి తెలియదని ఎద్దేవా చేశారు. అమరవీరుల స్థూపాన్ని రాజముద్రలో పెట్టడం వల్ల అమరుల తల్లిదండ్రులు సంతోషించరన్నారు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వలేదని, వేలాది మంది తెలంగాణ బిడ్డలను బలి తీసుకుందని ఆరోపించారు. కాకతీయుల వైభవాన్ని గుర్తించిన ఎన్టీఆర్ ట్యాంక్‌బండ్‌పై కాకతీయ కళాతోరణాన్ని పెట్టించారని గుర్తు చేశారు. రాజముద్ర మార్పుపై సర్కారు నిర్ణయం మార్చుకోకపోతే నిరసనలు చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు.

## కొండగట్టులో హనుమాన్ జయంతి

**నేటి ఫోకస్ న్యూస్, కొండగట్టు-మే30:**

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 1వరకు వేడుకలు కొనసాగనున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో దీక్ష విరమణ కోసం హనుమాన్ మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీక్షా విరమణ కోసం 300 మంది అర్చకులను, తలనీలాల సమర్పణ కోసం 1500 మంది నాయి బ్రహ్మణులను అధికారులు నియమించారు. 4ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. కొండపైకి చేరేందుకు ఆర్టీసీ నాలుగు ఉచిత బస్సులను నడుపుతున్నది. తాగునీరు, చలవ పందిళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. భద్రాచలం శ్రీ సీతారాముల తరపున భద్రాద్రి ప్రధాన అర్చకులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళాకారులు ప్రదర్శించిన వివిధ కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# 2న ఉదయం 10:35 గంటలకు
# రాష్ట్ర గీతం జాతికి అంకితం

(మొదటి పేజీ తరువాయి..)

వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాగా.. జూన్ 2న ఉదయమే కాక.. సాయంత్రం కూడా పలు కార్యక్రమాలు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఆరోజు ఉదయం 9:30 గంటలకు సీఎం రేవంత్ అమర వీరులకునివాళులర్పించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మళ్లీ సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద కార్నివాల్‌తో వేడుకలు ప్రారంభమై రాత్రి 9 గంటలకు ముగియనున్నాయి. సాయంత్రం 6:30 గంటలకు సీఎం రేవంత్ ట్యాంక్ బండ్ వద్దకు చేరుకుని అక్కడ ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం దాదాపు 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. ఆ తర్వాత జాతీయ జెండాలతో ట్యాంక్‌బండ్‌పై దాదాపు 5వేల మంది భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహించనున్నారు. ఈ ఫ్లాగ్ వాక్ జరుగుతున్న సమయంలో.. 13:30 నిమిషాల నిడివితో ఉన్న "జయ జయహే తెలంగాణ" గీతాన్ని ఆవిష్కరించనున్నారు. రాత్రి 8:50 గంటల నుంచి 9 గంటల దాకా.. అంటే పది నిమిషాల పాటు.. చుట్టుపక్కల లైట్లన్నీ ఆఫ్ చేసేసి బాణసంచా కాలుస్తారు. దీంతో వేడుకలు ముగుస్తాయి. అనంతరం.. రాష్ట్ర గీతాన్ని రచించిన కవి, రచయిత అందెశ్రీని.. దానికి స్వరకల్పన చేసిన సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణిని.. రాత్రి 8:44 నుంచి 8:50 గంటల మధ్య ప్రభుత్వం సన్మానించనుంది.

**మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ..**

రాష్ట్రావిర్భావ దశాబ్ది వేడుకలు, రాష్ట్ర గీతం తదిరత అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్, జూపల్లి, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, కవి అందెశ్రీ, సంగీత దర్శకులు ఎం.ఎం కీరవాణి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు తెలంగాణ బిల్లు ఆమోదించిన సమయంలో లోక్‌సభలో ఉన్న అప్పటి ఎంపీలు, ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతంతో పాటు, రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల నిర్వహణపై చర్చించారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఆవిర్భవించి పదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఆ వేడుకల్లోనే.. రాష్ట్ర గీతమైన 'జయజయహే తెలంగాణ'ను జాతికి అంకితం చేస్తామన్నారు. ఉద్యమకాలంలో అందరినీ ఉర్రూతలూగించి, తెలంగాణ ఖ్యాతిని చాటిన ఈ గీతాన్ని భవిష్యత్తులో తరతరాలు పాడుకునేలా, అందరి ఆమోదంతో, క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్రగీతంగా ఆమోదించామని సీఎం తెలిపారు. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ 20 ఏళ్ల క్రితం రాసిన ఈ గీతాన్ని యధాతధంగా ఉంచామని స్పష్టం చేశారు. అయితే.. ఈ గీతాన్ని రెండున్నర నిమిషాలు, 13:30 నిమిషాల నిడివితో రెండు వెర్షన్లలో రూపొందించామని.. వీటిలో 3 చరణాలతో కూడిన రెండున్నర నిమిషాల గేయం ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా ఉంటుందని రేవంత్ పేర్కొన్నారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని.. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లతోపాటు అన్ని ప్రభుత్వ సంస్థలనూ 'టీజీ'గా మార్చామని సీఎం గుర్తుచేశారు. అలాగే.. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

**500 నమూనాలు..:** తెలంగాణ రాష్ట్ర చిహ్నం ఆవిష్కరణ వాయిదా పడింది. ఈ చిహ్నం తుది రూపు సంతరించుకుని అందరి ఆమోదం పొందితే జూన్ 2నాడే విడుదల చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే.. తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర చిహ్నాలకు సంబంధించి.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి తమకు 500 నమూనాలు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వాటిపై చర్చలు జరుగుతున్నాయని.. చిహ్నానికి సంబంధించి ఇంకా తుది రూపమేదీ ఖరారు కాలేదని స్పష్టంచేశారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహాలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా.. అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా తెలంగాణ ప్రతిష్ఠ ఇనుమడించేలా, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందన్నారు.

**చార్మినార్ ఉండాల్సిందే..: ప్రభుత్వానికి మజ్లిస్ విజ్ఞప్తి**

తెలంగాణ సుదీర్ఘ చరిత్ర, సమ్మిళిత సంస్కృతికి ప్రతీకగా నిలిచిన చార్మినార్‌ను రాష్ట్ర అధికారిక చిహ్నంలో కొనసాగించాలని ప్రభుత్వానికి మజ్లిస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చార్మినార్‌ను అధికార చిహ్నం నుంచి తొలగిస్తున్నట్లు వస్తున్న వార్తలపై మజ్లిస్ నేతలు స్పందిస్తూ.. రాష్ట్ర చిహ్నంలో చార్మినార్‌ను తప్పకుండా ఉంచాలని డిమాండ్‌చేశారు.

## ముగిసిన ప్రచారం

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే30:**

లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. లోక్ సభ ఎన్నికల 7వ దశ పోలింగ్ జూన్ 1న జరగనున్నది. ఇదే చివరి దశ పోలింగ్. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 57 లోక్ సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనున్నది. ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు కూడా బరిలో ఉన్నారు. ప్రధాని మోదీ వారణాసి నుంచి పోటీ చేస్తున్నారు. కాగా, కొద్దిసేపటి క్రితం ప్రధాని మోదీ వారణాసి ఓటర్లకు వీడియో సందేశం పంపించిన విషయం తెలిసిందే. కాగా, బీహార్, హిమాచల్ ప్రదేశ్, యూపీ, పంజాబ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార?ండ్ మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరగనున్నది. యూపీ, పంజాబ్ నుంచి 13 లోక్ సభ నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ నుంచి 9 లోక్ సభ నియోజకవర్గాలకు, బీహార్ నుంచి 8 లోక్ సభ నియోజకవర్గాలకు, ఒడిశా నుంచి 6 లోక్ సభ నియోజకవర్గాలకు, హిమాచల్ ప్రదేశ్ నుంచి 4 లోక్ సభ నియోజకవర్గాలకు, జార?ండ్ నుంచి 3 లోక్ సభ నియోజకవర్గాలకు, చండీగఢ్ నుంచి ఒక లోక్ సభ నియోజకవర్గానికి పోలింగ్ జరగనున్నది. లోక్ సభ ఎన్నికలను మొత్తం ఏడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆరు దశల్లో లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇటీవలే జరిగిన 6వ దశలో 57 నియోజకవర్గాల్లో 61.98 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఐదో దశలో 49 నియోజకవర్గాల్లో 62.2 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. నాలుగో దశలో 96 నియోజకవర్గాల్లో 69.16 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మూడో దశ పోలింగ్ లో 94 నియోజకవర్గాల్లో 65.68 శాతం పోలింగ్ నమోదైంది. రెండో దశలో 88 నియోజకవర్గాల్లో 66.71 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇక మొదటి దశలో 102 నియోజకవర్గాల్లో 66.14 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మొత్తం ఏడు దశల్లో జరిగిన పోలింగ్ కు సంబంధించిన ఫలితాలు జూన్ 4న విడుదల కానున్నాయి. ఆరోజు తేలనున్నది ఏ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రానున్నది అనేది. అయితే, ఇప్పటికే ఇటు బీజేపీ, అటు ఇండియా కూటమి తమకంటే తమకు ఎక్కువ సీట్లు వస్తాయి.. తామే కేంద్రంలో అధికారంలోకి రాబోతున్నామంటూ పేర్కొన్న విషయం తెలిసిందే.

## ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి..)

నుంచి భక్తులను తీసుకుని జమ్మూకశ్మీర్‌లోని రియాసీ జిల్లా పౌనీ ప్రాంతంలో ఉన్న శివ్ ఖోరి వైపు వెళుతుండగా దుర్ఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ నుంచి ఈ బస్సు ప్రయాణం మొదలైంది. ప్రమాదం జరిగిన ట్టు తెలిసిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను అఖ్నూర్ సబ్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. క్షతగాత్రులను జమ్మూలోని ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)కు తరలించినట్టు చెప్పారు. బాధితుల్లో ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారేనని తెలిపారు. ఆర్మీ, పోలీసులు, స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మానవహారంగా ఏర్పడి మరణించిన వారితోపాటు క్షతగాత్రులను పైకి తీసుకువచ్చారు. లోయలోనుంచి బస్సును బయటకు తీయడానికి ఆర్మీ క్రేన్లను వినియోగించిందని తెలిపారు. మూలమలుపులో ఎదురుగా వస్తున్న కారును తప్పించే ప్రయత్నంలో డ్రైవర్ విఫలంకావడంతో బస్సు లోయలో పడిందని గాయపడిన ప్రయాణికులు తెలిపారు. ఈ విషాద ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'ఈ ప్రమాదంలో ప్రాణనష్టం గురించి తెలిసి చెప్పలేనంత బాధ కలిగింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని 'ఎక్స్'లో ముర్ము పోస్ట్ చేశారు. ఈ ప్రమాద ఘటనపై జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం హృదయవిదారకంగా ఉందని, ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.

## కేరళకు నైరుతి

(మొదటి పేజీ తరువాయి..)

అందించింది. నైరుతి రుతుపవనాలు గురువారం ఉదయం కేరళను తాకినట్లు ఐఎండీ అధికారికంగా ప్రకటించింది. కేర సహా ఈశాన్య రాష్ట్రాలను నైరుతి పవనాలు తాకినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో కేరళవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 14 జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వారంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించనున్నట్లు చెప్పారు. లక్షద్వీప్, కేరళలోని కొన్ని ప్రాంతాలకు రుతు పవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే అంచనా వేసింది. నాలుగైదు రోజుల్లో రుతు పవనాలు రాయలసీమలోకి ప్రవేశించే ఛాన్స్ ఉందని అధికారులు వెల్లడించారు. వారం ముందుగానే రుతుపవనాల పురోగమనంతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గతేడాది కంటే ఈసారి ముందుగానే నైరుతి పవనాలు కేరళను తాకాయి. దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. మన దేశంలో 52 శాతం నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ఆధారమే. ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40 శాతం వ్యవసాయ ఉత్పత్తులు దిగుబడి అవుతాయి. అటు, ఈ ఏడాది లానినా అనుకూల పరిస్థితులు, భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం, ఆగస్ట్ - సెప్టెంబర్ నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉన్న క్రమంలో ఈసారి సీజన్ లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అధికారులు గత నెలలోనే అంచనా వేశారు. వాయువ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. 1951 నుంచి 2023 వరకూ ఎల్‌నినో తర్వాత లానినా వచ్చిన సందర్భాల్లో భారత్‌లో తొమ్మిదిసార్లు మంచి వర్షాలు కురిశాయని.. ఈ ఏడాది కూడా రుతుపవనాలు కదలిక అనుకూలంగా ఉందని వివరించారు. సాధారణంగా ఈశాన్య భారతంలో జూన్ 5కు అటు, ఇటుగా రుతు పవనాలు ప్రవేశిస్తాయి. కానీ ఈసారి మే 30నే ప్రవేశించాయి. రేమాల్ తుఫాను ప్రభావంతో రుతు పవనాలు వేగంగా కేరళను తాకినట్లు వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు.

## అమరుల కుటుంబాలకు ఆహ్వానాలు

(మొదటి పేజీ తరువాయి..)

ఆహ్వానాలు పంపుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. అలాగే, అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జూన్ 2న రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ట్యాంక్‌బండ్ వద్ద అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సందర్శకుల కోసం ఫుడ్ కోర్టులు, షాపింగ్ స్టాల్స్, గేమింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడికి వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి, అందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పార్కింగ్, బందోబస్తుకు తగిన ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని, తొలుత అమరులకు నివాళులర్పించాలని అన్నారు. కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానించాలన్నారు.

**ఆయా శాఖల ఆధ్వర్యంలో పనులు..**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఆయా శాఖల అధికారులు ఇప్పటికే పనులు ప్రారంభించారు. పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్య అతిథులు, ఆహ్వానితులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు వేర్వేరుగా లాంజ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఎక్కువ స్థలంలో టెంట్‌లు వేస్తున్నారు. ప్రత్యేక మెడికల్ క్యాంపులతోపాటు తాగునీరు అందుబాటులో ఉంచనున్నారు. సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్లు, ప్రత్యక్ష ప్రసారాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 2వ తేదీ సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పోలీస్ కార్నివాల్, జయజయహే తెలంగాణ గీతంతో ఫ్లాగ్ వాక్ నిర్వహించనున్నారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన సాంస్కృతిక కళా బృందాలతో ప్రదర్శనలు ఉండనున్నాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరు కానున్నారు. సందర్శకుల వినోదం కోసం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తున్న 80 స్టాళ్లు శనివారం నుంచే అందుబాటులోకి రానున్నాయి. ఈ స్టాళ్లను రెండు రోజుల పాటు తెరిచి ఉంచనున్నారు.

## దశాబ్దాల తరవాత పూర్తి మెజార్టీ ప్రభుత్వం

– ఆధ్యాత్మిక గురువు రవిదాస్ తనకు ప్రేరణ
– పంజాబ్ హోషియార్‌పూర్ ప్రచారంలో ప్రధాని మోడీ

**నేటి ఫోకస్ న్యూస్, చండీఘడ్-మే30:**

దశాబ్దాల తర్వాత కేంద్రంలో పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటుకు సమయం ఆసన్నమైందని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. ఆధ్యాత్మిక గురువు రవిదాస్‌ను స్మరిస్తూ పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేయడానికి తనకు ఆయనే స్ఫూర్తిదాయకుడని మోడీ తెలిపారు. ఏడు దశల ఎన్నికల ప్రచారం ముగింపు రోజున ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగిస్తూ గడచిన పదేళ్లలో దేశం ఎవరూ ఊహించనంత అభివృద్ధిని సాధించిందని తెలిపారు. పేదల సంక్షేమమే తన ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతగా ఆయన ప్రకటించారు. ఇదే తాను గురు రవిదాస్ నుంచి పొందిన అతి గొప్ప స్ఫూర్తని ఆయన చెప్పారు. జలంధర్, హోషియార్‌పూర్ ప్రజలకు ఉపయోగపడే ఆదంపూర్ విమానాశ్రయానికి గురు రవిదాస్ పేరు పెట్టాలన్నదే తన ఆకాంక్షని ఆయన చెప్పారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇదే తన చివరి ప్రచార సభని మోడీ తెలియచేస్తూ హోషియార్‌పూర్‌ను చిన్న కాశీగా పిలుస్తారని, ఇది గురు రవిదాస్ తపోభూమి అని చెప్పారు. వారణాసి నుంచి తాను ఎంపీగా ఉన్నానని, గురు రవిదాస్ ఇక్కడ జన్మించారని, అందువల్ల ఈ పుణ్యభూమి తన ఎన్నికల ప్రచారాన్ని ముగించడం గర్వకారణమని ఆయన తెలిపారు.కాంగ్రెస్, ఇండియా కూటమిపై ఆరోపణలు గుప్పిస్తూ సర్జికల్ స్ట్రైక్‌కు వారు సాక్ష్యాలు అడిగారని, సైన్యం గ9ఉరించి వారు ఏనాడూ ఆలోచించలేదని అన్నారు. ఆ పార్టీలు అధికాంలో ఉండగా ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేశాయని ఆయన విమర్శించారు.

## పోటీ చేయకుండా మోడీపై అనర్హత వేటు వేయాలి

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే30:** ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయకుండా ప్రధాని నరేంద్ర మోడీని అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఇది నిరాధార, నిర్లక్ష్యంతో దాఖలుచేసిన పిటిషన్‌గా కోర్టు అభివర్ణించింది. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలు దురుద్దేశంతో కూడుకున్నవని, వీటిని అనుమతించలేమని జస్టిస్ సచిన్ దత్తా పేర్కొన్నారు. తాను పైలట్‌గా పనిచేస్తున్న ఎయిర్ ఇండియా విమానాన్ని 2018లో కూల్చడం ద్వారా దేశ భద్రతను దెబ్బతీయడానికి మోడీ, ఆయన సహచరులు ప్రయత్నించారని కెప్టెన్ దీపక్ కుమార్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌ను పూర్తిగా అసంబద్ధమైనదిగా కోర్టు అభిప్రాయపడింది. ప్రధాని మోడీపై నిరాధార ఆరోపణలు చేయడానికే ఈ పిటిషన్ దాఖలు చేశారని న్యాయమూర్తి పేర్కొన్నారు. కేంద్ర హోం మత్రి అమిత్ షా, పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాల అభ్యర్థిత్వాలపై కూడా అనర్హత వేటు వేయాలని పిటిషనర్ కోరారు. తాను ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హుడినని నరేంద్ర మోడీ రిటర్నింగ్ అధికారి ముందు తప్పుడు ప్రతిజ్ఞ చేశారని కూడా పిటిషనర్ ఆరోపించారు. ఎయిర్ ఇండియా అమ్మకంలో చురుకైన పాత్ర పోషించడం ద్వారా ప్రధాని మోడీ సాక్ష్యాలను నాశనం చేశారని ఆయన ఆరోపించారు. తన సర్వీసు రికార్డులను తారుమారు చేయడం ద్వారా తన పైలట్ లైసెన్సును ఎయిర్ ఇండియా రద్దు చేసిందని ఆయన ఆరోపించారు.

# రాజముద్రలో చార్మినార్ తొలగింపు

**◆ చార్మినార్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన ◆ రేవంత్ సర్కార్ మూర్ఖ నిర్ణయాలని కెటిఆర్ విమర్శ**





**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే30:** తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన కొత్తలోగోలో చార్మినార్ తొలగించడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటి రామారావు ఆందోళనకు దిగారు. పార్టీ శ్రేణులతో కలసి చార్మినార్ వద్దనిరసన చేపట్టారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పుల నేపథ్యంలో మాజీ మంత్రులు పద్మారావు గౌడ్, రాజయ్య, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, పార్టీ నాయకులతో కలిసి చార్మినార్ వద్ద కేటీఆర్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రగతి కనిపించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పుల ప్రతిపాదన దృష్ట్యా భారాస నేతలు చార్మినార్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. కేసీఆర్ పేరు కనిపించకుండా ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటోంది. రాజకీయ కక్షతోనే మార్పు చేస్తోంది. రాష్ట్ర చిహ్నంలో చార్మినార్‌ను తొలగించడం హైదరాబాదీలను విస్మరించడమే. అమరవీరుల స్థూపం, తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలను చేర్చితే అభ్యంతరం లేదు. చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించడం మూర్ఖపు నిర్ణయమే కాగలదని విమర్శించారు. హైదరాబాద్ ఐకాన్‌గా చార్మినార్ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. తెలంగాణ ఉద్యమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనలేదు. అందుకే కేసీఆర్ పెట్టిన గుర్తులు మార్చాలని ఆయన చూస్తున్నారు. లోగో మార్పుపై భారాస తరఫున నిరసన కార్యక్రమాలు చేపడతాం అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటున్నదని, వాటిని అంగీకరించేది లేదని కేటీఆర్ అన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. పదేండ్లలో సాధించిన ప్రగతిని కాదని కాంగ్రెస్ సర్కార్ మొండి వైఖరి అవలంబిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..లోగో నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశ పూర్వకంగా రాజముద్రను మారుస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ అంటే అందరికీ గుర్తొచ్చేది చార్మినారని తెలిపారు. ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే మార్పు చేస్తున్నదని తెలిపారు. రాజముద్రను ఇంత అత్యవసరంగా మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. లోగోలో చార్మినార్‌ను తొలగించడం అంటే హైదరాబాదీలను అవమానించడమేనన్నారు. అధికారిక చిహ్నంలో మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. అమర వీరుల స్థూపాన్ని రాజముద్రలో పెట్టినంత మాత్రాన.. కాంగ్రెస్ పార్టీ వల్ల అమరులైన వారి తల్లిదండ్రులు సంతోష పడరని చెప్పారు. సోనియా గాంధీ బలి దేవత అని చెప్పిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ రేపటి రోజున ఎన్ని కార్యక్రమాలు పెట్టినా మర్చిపోలేని విషయం ఏంటంటే వేలాది మంది మృతులకి కారణమైన ఆ పార్టీని ప్రజలు క్షమించరని స్పష్టంచేశారు. ఇకపోతే తెలంగాణ అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.. చిహ్నంలో మార్పులు చేర్పులపై కసరత్తులు జరుగుతున్నాయి. ప్రజలు, ప్రజాజీవితం, ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, అమరుల త్యాగం తదితర అంశాలు ప్రతిబింబించేలా దీనిని రూపొందించేందుకు రేవంత్ సర్కార్ నిర్ణయించింది.. అయితే, అంతకుముందున్న చిహ్నంలోని చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. తెలంగాణ చిహ్నం మార్పుపై గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు తెలుపుతోంది. హైదరాబాద్ చార్మినార్ దగ్గర జరిగిన నిరసనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్ర చిహ్నం నుంచి చార్మినార్ ను తొలగించడంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. చార్మినార్ దశాబ్దాల తరబడి హైదరాబాద్‌కు ఐకాన్‌గా ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని.. నగరం గురించి ఎవరైనా ఆలోచిస్తే వారు ప్రపంచ వారసత్వ హోదా పొందేందుకు అన్ని అర్హతలున్న చార్మినార్ గురించి ఆలోచించకుండా ఉండలేరని చెప్పారు. కానీ ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పనికిరాని కారణాలను సాకుగా చూపుతూ చార్మినార్‌ను రాష్ట్ర అధికారిక ముద్ర నుంచి తొలగించాలని భావిస్తోందంటూ ఎక్స్‌లో రాశారు.

## ఉపాధి కూలీకి దొరికిన వెండినాణాలు

**◆ మట్టి తవ్వుతుండగా రాతి పాత్రలో నాణాలు**
**◆ సమాచారం తెలుసుకుని స్వాధీనం చేసుకున్న అధికారులు**

**నేటి ఫోకస్ న్యూస్, సిద్దిపేట-మే30:**

ఉపాధి పనులు చేస్తున్న ఓ కూలీకి పురాతన కాలం నాటి వెండినాణాలు లభించాయి. మట్టి తీవ్వుతుండగా ఓ చిన్న డబ్బా లాంటిది దొరికింది. దానిని తెరిచి చూడగా అందులో పాత నాణాలున్నాయి. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు ఓ రాతి పాత్ర దొరికింది. దీంతో తొలుత రాతి పాత్రను ఓపెన్ చేసేందుకు కూలీలు భయపడ్డారు. కొంతమంది కూలీలు దానిని తెరిచి చూశా రు. ఆ పాత్రలో పురాతన కాలం నాటి 25 వెండి నాణెళిలు, రెం డు వెండి ఉంగరాలు లభ్యమయ్యాయి. పురాతన నాణెములు దొరి కిన విషయాన్ని గ్రామస్తులు బహిర్గతం చేయగా చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో రామ్మోహన్ తదితర అధికారులు గ్రామానికి చేరుకొని, కూలీలకు దొరికిన నాణెళిలను పరిశీలించారు. ఇవి నిజాం కాలం నాటి నాణెములు గా భావిస్తున్నట్లు తెలిపారు. వాటిని పురావస్తు శాఖకు పంపించ నున్నట్లు అధికారులు తెలిపారు.

## రైలు కిందపడి ఇద్దరు మృత్యువాత

**నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-మే30:**

నల్లగొండ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గూడ్స్ రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కల కలం రేపింది. వివాహేతర సంబంధమే వీరిని ఆత్మహత్యకు పురి గొలిపిందని అనుమానిస్తున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ లో ఇద్దరు రైలుకింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. గమనిం చిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే సంఘట న స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతులు మిర్యాల గూడ మండలం వెంకటాద్రిపాలెం దుర్గానగర్ వాసులుగా గుర్తిం చారు. వివాహేతర సంబంధమే ఆత్మహత్యకు కారణమని అను మానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కరెంట్ తీగ తగిలి రైతు మృత్యువాత

**నేటి ఫోకస్ న్యూస్, జోగులాంబ గద్వాల-మే30:**

విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఉండవెల్లి మండలం మారమునగాల-2కు చెందిన ఒనూరు బాషా (45) గురువారం కౌలు పొలం దున్నేందుకు తన కొడుకు షేక్షావలీ, ట్రాక్టర్ డ్రైవర్ రాజుతో కలిసి వెళ్లాడు. దుక్కి దున్నే క్రమంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు ట్రాక్టర్‌కు తగిలే అవకాశం ఉండంతో కట్టె సాయంతో వైర్లను పైకిలేపాడు. అదే సమయంలో త్రీఫేస్‌లోని ఒక తీగ తెగి బాషా చేతిపై పడడంతో షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే అతన్ని కర్నూలు దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాషా మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## ఆదిలాబాద్‌లో పత్తి రైతుల ఆందోళన

◆ విత్తనాల కోసం మూడో రోజూ రోడ్డెక్కిన రైతులు
◆ పంజాబ్ చౌక్‌లో ఆందోళనతో ట్రాఫిక్ జామ్
◆ రైతులకు న్యాయం చేస్తామని అధికారుల హామీతో విరమణ



**నేటి ఫోకస్ న్యూస్, ఆదిలాబాద్-మే30:**

పత్తివిత్తనాల కోసం రైతుల ఆందోళన కొన సాగుతోంది. ఆదిలాబాద్‌లో వరుసగా మూడో రోజూ రైతులు విత్తనాల కోసం రోడ్డెక్కారు. అయితే పలు జిల్లాల్లో విత్తన సంక్షోభం నెల కొన్నది. విత్తనాల కోసం రైతుల వెతలు అన్నీ ఇన్నీ కావు. పచ్చిరొట్ట విత్తనాలనే పంపిణీ చేయలేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. జనుము, జీలుగ, పచ్చి రొట్ట విత్తనాలు ఇవ్వలేని ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు సరిపడా ఇస్తుందా..అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా పత్తి విత్తనాలకొరతపై రైతుల ఆగ్రహం వ్యక్తంగా చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా మూడో రోజు విత్తనాల కొరతతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు ఒక్కో రైతుకు రెండు ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. విత్తనాల పంపిణీ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని పంజాబ్ చౌక్‌లో రైతులు ధర్నా చేపట్టారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విత్తనాల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్ ఉన్న ప్రముఖ కంపెనీ పత్తి విత్తనాలను హోల్‌సేల్ వ్యాపారి మరో దుకాణానికి తరలించడం ఆదిలాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మూడు రోజులుగా రైతులు బారులు తీరి ఆ కంపెనీ విత్తనాల కోసం ఇబ్బందులు పడుతుండగా గురువారం ఆదిలాబాద్ పట్టణం కిసాన్ చౌక్‌లోని నిఖిల్ ట్రేడర్స్ విత్తనాల దుకాణం నుంచి వాహనంలో 160 బ్యాగులను ఇచ్చోడ కేంద్రానికి తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. రోజంతా లైన్లో నిల్చుంటే రెండు పత్తి విత్తన బ్యాగులు కూడా దొరకడం లేదని, ప్రైవేట్ డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు డీలర్‌ను నిలదీసిన రైతులంతా పంజాబ్ చౌరస్తా రహదారిపై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. హోల్ సేల్ దుకాణం నుంచి ఇచ్చోడ రిటైల్ డీలర్‌కు వే బిల్లుతో సహా పత్తి విత్తనాల ప్యాకెట్లు పంపుతున్నట్టు డీలర్ తెలిపాడు. దీంతో ఆగ్రహించిన రైతులు దొంగచాటుగా విత్తనాల అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని నిలదీశారు. నిఖిల్ ట్రేడర్స్ నుంచి పత్తి విత్తనాల తరలింపు వ్యవహారంపై లోతుగా విచారణ జరుపుతున్నామని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. నిజంగానే బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. విత్తనాల కొరత, డీలర్ల ఆగడాలపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని వ్యవసాయ అధికారి పుల్లయ్య భరోసా ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

## విత్తనాలు అడిగితే లాఠీ-ఛార్జా

**- ఇదేనా కాంగ్రెస్ రైతు ప్రభుత్వం: జోగురామన్న**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే30:**

రైతుల సమస్యల పక్కన పెట్టి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. పత్తివిత్తనాల కోసం రైతులు రోడ్డెక్కుతున్నా పట్టింపు లేకుండా పోయిందన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దిలాబాద్ లో అడిగిన పత్తి విత్తనాలను ఇవ్వకుండ రైతులపై లాఠీ ఛార్జ్ చేశారని మండిపడ్డారు. రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాలని, లేకుంటే రైతులతో కలసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతుల సమస్యల పక్కన పెట్టి తెలంగాణ రాజ ముద్రను మార్చే పనిలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నాడని, ఉప ముఖ్యమంత్రి వేరే రాష్ట్రాల్లో ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కొత్త మద్యం టెండర్ల విషయం తనకు మద్యం మంత్రి జూపల్లి కృష్ణారావు అంటున్నాడన్నారు. ట్యాక్స్‌ల పేరుతో వసూల్ చేసిన డబ్బులను ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక రైతుల పరిస్థితి ఆగమైందని, చెప్పులు, బట్టలు లైన్‌లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలు ఎండిపోయి 250 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు.

## ఇండియా కూటమిదే అధికారం

**- ఫలితాలు రాగానే 48గంటల్లో ప్రధానిని తేల్చేస్తాం: జైరామ్**

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే30:** లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా నిర్ణయాత్మక తీర్పును పొందుతుందని, 48 గంటల్లోనే ప్రధానిని ఎన్నుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ గురువారం తెలిపారు. ఇండియా బ్లాక్ గరిష్ఠ సీట్లను పొందగలదని కూడా ఆయన తెలిపారు. ఏడోదశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం చివరి రోజున ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఇండియన్ నేషనల్ డెవలప్ మెంట్ ఇన్క్లూజివ్ అలెయెన్స్(ఇండియా) దిగువ సభలో 272కు పైగా సీట్లు గెలుచు కుంటుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఇండియా 'జన్బంధన్' పార్టీలో ప్రజా తీర్పును పొందాక ఎన్ డిఏ పార్టీలు కూడా సంకీర్ణంలో చేరతాయి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరిని తీసుకోవాలి, ఎవరిని తీసుకోకూడదనేది నిర్ణయిస్తుందన్నారు. నితీశ్ కుమార్, చంద్రబాబు వంటి వారిని చేర్చుకుంటారా? అని అడిగినప్పుడు జైరామ్ రమేశ్ నితీశ్ కుమార్ పల్టీ కొట్టడంలో మాస్టర్' అన్నారు.

## తెలంగాణ పీజీఈసెట్ హాల్‌టికెట్లు విడుదల

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మే 30:**

తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) 2024 పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదల అయ్యాయి. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెలంగాణ పీజీఈసెట్ 2024 పరీక్ష జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్ష జరుగుతుంది. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుంది. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 12.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

ఈ ఏడాది జేఎన్‌టీయూ హైదరాబాద్ పీజీఈసెట్ పరీక్ష నిర్వహిస్తోంది. పీజీఈసెట్ 2024లో వచ్చిన ర్యాంకు ఆధారంగా 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అఫిలియేటెడ్ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కాలేజీల్లో ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్, గ్రాడ్యుయేట్ లెవెల్ ఫార్మడీ, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

కాగా తెలంగాణ ఈజీఈసెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు 120 మార్కులకు 2 గంటల్లో సమాధానాలు గుర్తించవల్సి ఉంటుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉండదు.

ప్రవేశ పరీక్షలో మొత్తం మార్కుల్లో కనీసం 25 శాతం మార్కులు వచ్చిన వారిని మాత్రమే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు. ఇక ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన విద్యార్థులకు క్వాలిఫైయింగ్ మార్కులు ఉండవు. ఎన్ని మార్కులు వచ్చినా ర్యాంకు కేటాయిస్తారు.

## ఆదివాసీల మనుగడ, హక్కులకు భంగం

**◆ పెను ప్రమాదంలోకి నెడుతున్న పాలకులు**

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్-మే30:**

ఆదివాసీలకు ప్రత్యేక రాజ్యాంగ హక్కులు ఉంటాయన్న సంగతి కానరావడంలేదని ఆదివాసి హక్కుల పోరాటసమితి, తుడుందెబ్బ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి సిద్దబోయిన లక్ష్మి నారాయణ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నాటినుండి పాలనలోనికి వచ్చిన పాలకులు ఆదివాసీలను,వారి నివాస ప్రాంతాలను, వారి రాజ్యాంగ హక్కులను పరిగణంలోనికి తీసుకోలేదని ఆరోపించాడు. తెలంగాణ రాష్ట్రంలోని 10 జిల్లాలను ఆశాస్త్రీయంగా 33 జిల్లాలుగా ఏర్పాటు చేసేక్రమంలో ఆదివాసీలను నివాస ప్రాంతాలను ముక్కుచెక్కలు చేసిన క్రమాన్ని ఆదివాసీలు తప్పుపట్టి మాప్రాంతాలను ఒకే జిల్లాలుగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలను పెట్టారు. పాలకులు ఆదివాసీల ప్రతిపా దనలను ప్రక్కకు నెట్టి జిల్లాలను ఏర్పాటు చేశారు. ఆ జిల్లాల ఏర్పా టుతో ఐటీడీఏల ద్వారా అభివృద్ధి జరగాల్సిన ఆదివాసీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. జీవో.ఎంఎస్ నెం.57 ఐటీడీఏల 5వ షెడ్యూల్డ్ ప్రాంతాల పాలన, అభివృద్ధి, ఆదివాసుల వికాసం, పురోభివృద్ధి, కాలనుగుణంగా మారుతున్న ధృక్పధాలకు అనుగుణంగా ఆదివాసీల పరిస్థితిని అంచనావేసి ప్రణాళికలు తయారు చేసే ఐటీడీఏల పాత్ర నామమాత్రంగా మారిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33జిల్లాలను నూతన జోనల్ వ్యవస్థను ఆదివాసీ ప్రాంతాలను కలుపుతూ ఏర్పాటు చేశారు. ఈ జోనల్ వ్యవస్థ ముసాయిదాను రూపొందించే క్రమంలో ఆదివాసీల నివాస ప్రాంతాలను,ప్రత్యేక హక్కులను రాజ్యాంగ రూపకర్తలుప్రతి పాదించి రాజ్యాంగంలో పొందపరిచారన్న సంగతిని మరచిపోయినారన్నారు. ఆదివాసీల ప్రత్యేక స్థితి గతులను పరిగణలోనికి తీసుకోవలన్న సంగతిని మరచిపోయి,సాధారణంగా మైదాన ప్రాంతాలను వర్తించే అంశాలను రూపొందించి, 2018 రాష్ట్రపతి జోనల్ ఉత్తర్వులను పొందింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. ఈ ఉత్తర్వులను అమలు చేయుటకుగాను, జీవో.317ని రూపొందించి నిర్లాక్ష్యణంగా అమలు చేసి, ఆదివాసీల రాజ్యాంగ పరిమితులను చెదరగొట్టిందన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు ప్రత్యేకంగా జారీ చేసిన ఉద్యోగ కల్పన జీవోలను కనుమరుగు చేసిందన్నారు.

## విద్యార్థుల జీవితాలతో ఐటీడీఏ చెలగాటం

**◆ తప్పిదాలపై విచారణ చేయాలి:గిరిజన సంఘాలు**

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్-మే30:**

హన్మకొండ, జనగామ,ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, వరంగల్‌జిల్లాల ఐటీడీఏ పరిధి పాఠశాలలో, హాస్పిటల్స్, సెల్ఫ్‌మేనేజ్‌మెంట్,హాస్టల్స్,వైటీసీఎస్,పీఈటీసీలలో డీటీడీవోల డిపుటేషన్స్ దందా అంతాఇంత కాదని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ డిప్యుటేషన్స్‌కు ప్రధాన కారణం గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేనని ఆ సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరు జిల్లాలోని పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందంటున్నారు. అక్కడి పాఠశాలల పరిస్థితిని తెలుసుకోకుండ క్రిందిస్థాయి అధికారులు ఇచ్చే తప్పుడు నివేదికలు చూసి ఇదే వాస్తవమని ప్రకటించడం విచారకమని గిరిజన సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నియబంధనలకు విరుద్దంగా డిప్యూటేషన్స్ కొనసాగుతున్నాయని అనేక మార్లు గిరిజన సంఘాలు ఫిర్యాదు చేసిన గిరిజన సంక్షేమం ఉన్నతాధికారులు నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందని వాపోతున్నారు. ఈ డిప్యూటేషన్స్ కారణంగా ఈ ఆరు జిల్లాల్లోని గిరిజన బాలుర, బాలికల పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్, 10వ తరగతి ఫలితాలపై ప్రభావం చూపుతున్నాయంటున్నారు.

## మళ్లీ మండుటెండలు

**◆ రెండ్రోజుల్లో వర్షాలు: వాతావరణ శాఖ**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే30:**

తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. అకాల వర్షాలు ముఖం చాటేయడంతో ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మళ్లీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. రాష్ట్రంలో జూన్ ఒకటి నుంచి మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. జూన్ ఒకటిన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే, 2వ తేదీ నుంచి 3వ తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

## పాలప్యాకెట్ కోసం వెళితే వెళ్లే ప్రాణం పోయింది

**◆ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్న డీసీఎం వ్యాన్**
**◆ తండ్రి అక్కడికక్కడే మృతి, చిన్నారికి గాయాలు**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే30:**

నగరశివారు ప్రాంతంలో దారుణ ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం పాలప్యాకెట్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి డిసిఎం రూపంలో వచ్చిన మృత్యువుకు బలయ్యాడు. పాల ప్యాకెట్ కోసం ఉదయాన్నే ఆ తండ్రి తన రెండేళ్ల చిన్నారితో కలిసి వెళ్లాడు. ఇంతలోనే డీసీఎం రూపంలో మృత్యువు అతన్ని కబళించింది. ఏం జరుగుతుందో తెలియని ఆ చిన్నారి గాయాలతో తండ్రి మృతదేహం వద్దే కన్నీళ్లు ఏడుస్తూ కూర్చున్నాడు. స్థానికులు సదరు చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. ఈ హృదయ విదారక ఘటన హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ లోని ఇనాంగూడ వద్ద హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై గురువారం ఉదయం కనకప్రసాద్ అనే వ్యక్తి తన రెండేళ్ల కుమారుడితో కలిసి పాల ప్యాకెట్ తీసుకొచ్చేందుకు వెళ్లారు. ఈ క్రమంలో హైవేపై వీరు వెళున్న బైక్‌ను విజయవాడ నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రసాద్ మృతి చెందారు. బాలుడికి గాయాలు కాగా.. తండ్రి మృతదేహం వద్దే ఏడుస్తూ కూర్చున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఏపీలోని కొవ్వూరు ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు. జీవనోపాధి కోసం 10 రోజుల క్రితమే వీరి కుటుంబం ఈ ప్రాంతానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# మోదీ పాత్రలో నటించడమా..? నో ఛాన్స్: సత్యరాజ్



**తమిళ సీనియర్ నటుడు** బాహుబలి ఫేమ్ కట్టప్ప సత్యరాజ్ పొలిటికల్ బయోపిక్ చేయనున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. భారత ప్రధాని నరేంద్ర మోదీ జీవితంపై ఓ బయోపిక్ రాబోతుండగా.. ఈ బయోపిక్‌లో సత్యరాజ్ మోదీ పాత్ర పోషించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై సత్యరాజ్ ఇటీవలే స్పష్టత ఇచ్చాడు. నరేంద్ర మోదీ బయోపిక్‌లో నేను నటించనున్నట్లు వస్తున్న వార్తలు అబద్ధమని తెలిపాడు. నా ఐడియాలజీ.. మోదీ ఐడియాలజీ వేరని.. ద్రావిడ ఉద్యమ పితామహుడు పెరియార్‌ను ఆరాధించే నేను మోదీ బయోపిక్‌లో నటిస్తారని ఎలా అనుకున్నారు అంటూ సత్యరాజ్ చెప్పుకోచ్చాడు. దీంతో ఈ వివాదం ముగిసిపోయింది. అయితే తాజాగా ఓ మూవీ ఈవెంట్‌లో పాల్గోన్న సత్యరాజ్ నరేంద్ర మోదీ పాత్రలో నటించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. తమిళ నటుడు విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న చిత్రం మళై పిడిక్కత మనితాన్ . ఈ సినిమా టీజర్ ఈవెంట్‌లో పాల్గోన్న సత్యరాజ్ మోదీ బయోపిక్‌పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. సత్యరాజ్ మాట్లాడుతూ.. మోదీ పాత్రలో నటించడానికి నన్ను ఎవరూ సంప్రదించలేదు. నిజంను నిజాయితీగా చూపించే నా మిత్రుడు దివంగత దర్శకుడు మణివణ్ణన్ మోదీ బయోపిక్‌కు దర్శకత్వం వహించినట్లయితే నేను ఈ సినిమాలో నటించి ఉండవచ్చు. ఇప్పుడు అతను లేడు కాబట్టి 'వెట్రి మారన్' కానీ లేదా పా.రజిత్ కానీ మరి సెల్వరాజ్లాంటి దర్శకులు ఈ బయోపిక్‌కి దర్శకత్వం వహిస్తే ఇందులో నటిస్తా అంటూ సత్యరాజ్ వ్యంగంగా సమాధానమిచ్చాడు.



# రన్‌వీర్‌తో ప్రశాంత్‌వర్మ రాక్షసకు బ్రేక్..

**అధికారిక ప్రకటన చేసిన చిత్ర బృందం**



కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన.. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కనున్న 'రాక్షస' ఆగిపోయింది. మైత్రీ మూవీస్ మేకర్స్‌పై రానున్న ఈ చిత్రంపై తాజాగా టీమ్ అధికారిక నోట్ విడుదల చేసింది. ప్రస్తుతానికి వాయిదా పడిందని.. భవిష్యత్తులో వీళ్లిద్దరూ కలిసి పని చేయనున్నట్లు తెలిపింది.దీని గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. 'రణ్‌వీర్ లాంటి ఎనర్జిటిక్ హీరో దొరకడం చాలా కష్టం. ఎంతో టాలెంటెడ్. భవిష్య త్తులో ఆయనతో కలిసి వర్క్ చేస్తాను' అన్నారు. రణ్‌వీర్ స్పంది స్తూ.. 'ప్రశాంత్ ఆలోచనలు మరోస్థాయిలో ఉంటాయి. మేమిద్ద రం కలిసి ప్రాజెక్ట్ చేయాలని చర్చిం చాం. ఫ్యూచర్‌లో తప్పకుండా చేస్తాం' అన్నారు. మైథలాజికల్ టచ్ ఉన్న పీరియాడికల్ డ్రామాగా రూ.200 కోట్లతో పాన్ ఇండియా స్థాయిలో దీన్ని తెరకెక్కించాలని మేకర్స్ భావించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం ఎందుకు వాయిదా పడిందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్ల ఆగిపోయిందనే రూమర్స్‌ను టీమ్ ఇటీవలే ఖండించడం గమనార్హం.ఇక ప్రస్తుతం ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్'తో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది ఘన విజయం సాధించిన 'హను-మాన్' కు సీక్వెల్‌గా ఇది రానుంది. 'హను- మాన్' కంటే వందరెట్లు భారీ స్థాయి లో 'జై హనుమాన్' ఉండనుంది. దీని కంటే ముందు 'అధీర', 'మహాకాళి' అని రెండు ప్రాజెక్టలతో పలకరించనున్నారు.



# పోలీసులకు దమ్కీ ఇచ్చిన నివేదా పేతురాజ్

దాస్ క దమ్కీ హీరోయిన్ నివేదా పేతురాజ్‌కు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులతో ఆమె గొడవపడుతున్నట్లు ఉన్న ఆ వీడియో చూసినవారంతా తమదైన శైలిలో కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ అందులో ఏముందంటే.. కారులో ప్రయాణిస్తోన్న నివేదను పోలీసులు ఆపి డిక్కీ ఓపెన్ చేయాలని కోరారు. దీనికి ఆమె అంగీకరించకపోగా కోపంగా మాట్లాడారు. 'రోడ్డు వరకు వెళుతున్నాను. నా దగ్గర పేపర్స్ అన్నీ కరెక్ట్‌గానే ఉన్నాయి. కావాలంటే చెక్ చేసుకోండి. డిక్కీలో ఏం లేవు. అర్థం చేసుకోండి. ఇది పరువుకు సంబంధించిన విషయం. ఇప్పుడు చెప్పినా మీకు అర్థం కాదు. నేను డిక్కీ ఓపెన్ చేయలేను' అని కోపంగా చెప్పారు. ఇదంతా రికార్డు చేస్తున్న వ్యక్తి ఫోన్‌ను ఆమె లాగేసుకున్నారు. అయితే ఇది చూసిన నెటిజన్లు కావాలనే ఇలా చేశారని కామెంట్స్ చేస్తున్నారు. ఏదైనా ప్రమోషన్స్ కోసం ఇదంతా చేసుండొచ్చని భావిస్తున్నారు. 'మెంటల్ మదిలో' అంటూ టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన నివేద.. చివరిసారి విశ్వక్ సేన్ 'దాస్ కా ధమ్కీ'లో కనిపించారు. ప్రస్తుతం ఏ ప్రాజెక్ట్‌ను ప్రకటించలేదు. దీంతో తన అప్‌కమింగ్ మూవీ కోసం ఇలా ప్రాంక్ చేసి ఉండొచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# ఆసక్తికరంగా హరోంహర ట్రైలర్

'యుద్ధం ఎవరితోనైనా సేయొచ్చు.. ఆయుధాలు సేసేవాడితో కాదు' అంటున్నారు సుధీర్‌బాబు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'హరోం హర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. సుమంత్ జి.నాయుడు నిర్మాత. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ ముఖ్య పాత్ర పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. సుధీర్‌బాబు తుపాకీ తయారు చేయడంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం అలరించేలా ఉంది. 1989లో చిత్తూరు నేపథ్యంలో సాగే కథ, కథనాలతో ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

